ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025



వేళ్లు లేవని వదిలేశారు..!

అడవిలో నాలుగు రోజుల పసికందు

వదిలేసి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



అమ్మఒడి నుంచి లోకానికి పరిచయమైన రోజే ఆ చిన్నారిని కష్టం వెంటాడింది. పుట్టిన గంటల్లోనే అమ్మకు దూరం అయ్యింది. నాన్న స్పర్శను తాకకుండానే ఎవరూ లేని అనాథగా మారింది. ఇంటి మహాలక్ష్మిగా ఎదగాల్సిన బిడ్డ అమానవీయంగా అడవిలోకి చేరింది. అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన పసిహృదయం ఎముకలు కొరికే చలిలో అడవి చెట్ల మధ్య గుక్కపట్టి ఏడుస్తూ రోజంతా గడిపింది. చేతి వేళ్లులేవన్న కారణంతో అమ్మానాన్నల ప్రేమకు దూరమై అడవిచెంతకు చేరిన నాలుగు రోజుల వయస్సున్న చిన్నారి ఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామ సమీపంలోని అటవీ శాఖ అతిథి గహం వద్ద బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...



కాలసముద్రం అటవీ ప్రాంతంలో ఉన్న చిన్నారి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కాలసముద్రం అటవీశాఖ అతిథి గృహం వెనుక ఉన్న అటవి ప్రాంతంలో బుధవారం ఉదయం ఓచిన్నారి ఏడుపు అటుగా వెళ్తున్న వారికి విన్పించింది. ఎవరూ లేని నిర్మానుష్య ప్రాంతం నుంచి చిన్నారి ఏడుపు విన్పించడంతో అటుగా వెళ్తున్న వారు అక్కడికి వెళ్లి చూశారు. అక్కడ చెట్ల మధ్యన పసిపాప కన్పించింది. నిర్ఘాంతపోయిన స్థానికులు అక్కడ ఎవరైనా ఉన్నారేమోనని వెతికారు. ఎవరూ కన్పించకపోవడంతో వెంటనే పోలీసులు, ఐసిడిఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారిని పరిశీలించగా ఎడమచేతికి నాలుగు వేళ్లు లేనట్లు గుర్తించారు. వెంటనే పాపను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నాలుగు రోజుల క్రితం జన్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి బాగా ఉన్నట్లు తెలియజేశారు. ఆడబిడ్డ ఆపై చేతికి వేళ్లు లేవన్న కారణంతోనే చిన్నారిని వదిలేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.

చలి..చలి..!







వాతావరణం ఒక్కసారిగా మారింది. గత 20 రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు దాటగానే చలిపంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేస్తోంది. గడిచిన వారం రోజులుగా చలి ప్రభావం మరింత ఎక్కువ అయ్యింది. సాయంత్రం నుంచి వేకువజాము వరకు జనం 'చలి'గింతలకు గురవుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- రాత్రిళ్లు 17 డిగ్రీలు నమోదు
- సాయంత్రం నుంచే చలి ప్రారంభం
- వణికిపోతున్న జనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో చలిప్రభావం ఒక్కసారిగా పెరిగింది. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. అనూహ్యంగా పడిపోయిన ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి. మంగళవారం నాడు అనంతపురంలో గరిష్టం 29 కాగా కనిష్టం 17 డిగ్రీలు నమోదు అయ్యింది. రాత్రి నుంచి ఉదయం 7 గంటల వరకు శీతలగాలులు వీస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కప్పుకుంటోంది. రాత్రి 7 గంటలు దాటిన తరువాత చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. చలితీవ్రత పెరగడంతో జనం గజగజ వణకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. ఇప్పటికీ కొన్ని వంకలు, వాగులు నీటితో ప్రవహిస్తున్నాయి. వీటి రిత్యా కూడా చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతూ వస్తున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడంతో రాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు తగ్గడం లేదు. దీంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. చలి పెరుగుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరింత పెరిగే అవకాశం.. జాగ్రత్తలు పాటించాలి...

ప్రస్తుతం చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. జనవరి మూడవ వారం వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక జబ్బులున్న వారు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలిగాలులు ఎక్కువగాఉండే సమయంలో ప్రయాణం చేయడం మంచి కాదంటున్నారు. ఒకవేళ ప్రయాణాలు చేసినా చెవులను పూర్తిగా కప్పుకునే ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. చలిని తట్టుకునేలా స్వెట్టర్లు, చేతులకు గ్లౌజులు ధరిస్తే ఉత్తమం అని సూచిస్తున్నారు.



కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లా అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ల సదస్సులో ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం నాడు కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రికి తెలియజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా 2047 విజన్ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసేలా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వందశాతం లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, అధికారులు అందరి సహకారంతో శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేశామన్నారు.

'పది' మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వారు రూపొందించిన 'పది' మోడల్ పేపర్లను బుధవారం ధర్మవరం రూరల్ మోటుమర్ల కే జి వి పి మోడల్ స్కూల్‌లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్ర రెడ్డి, నాయకులు రామకృష్ణ, కేజీబీవీ ఎస్ఒ చంద్రకళ, ఉపాధ్యాయులు, ఓం ఆదిగురు ఉచిత యోగా కేంద్రం యోగ గురువు గొర్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోడల్‌పేపర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు

కలెక్టరేట్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సెమీ క్రిస్మస్ వేడుకలను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు శ్రీదేవి, శ్రీనివాస్, మణిప్రియ, వెంకటరమణ, నాయకులు స్వాముకోటి ఆదినారాయణ, ఫాస్టర్స్, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.

ఐదేళ్ల బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజుల క్రింతం ఐదు సంవత్సరాల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువకుడు అత్యాచార యాతనానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం సాయంకాలం వీధిలో ఆడుకుంటుండగా చాక్లెట్ ఇస్తానని చెప్పి ఇంటిలోకి తీసుకెళ్లిన యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆలస్యంగా తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : మంత్రి

ఐదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఈ ఘటనపై ఎస్పీతో ఫోన్లో మాట్లాడారు. బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అన్నారు.

పెన్షనర్లను నిర్లక్ష్యం చేయొద్దు

ఎన్నికల హామీలు అమలు చేయాలి - రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రాజ్యాంగం కల్పించిన పెన్షన్ తదితర హక్కులను నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప డిమాండ్ చేశారు. అఖిల భారత పెన్షనర్‌ల దినోత్సవ వేడుకలు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు లలితకళాపరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య, సర్వజనాసుపత్రి అనస్థీషియా ప్రొఫెసర్ సుబ్రమణ్యం, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ సుధాకర్, ఎపి ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, నగర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు అక్బర్, లలితకళాపరిషత్ కార్యదర్శి పద్మజ, సామాజిక కార్యకర్త రవికాంత్ రమణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పెన్షన్ పెన్షనర్‌ల హక్కు అని ఎవరి బిక్షం కాదన్నారు. అలాగే రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన హక్కులు అమలు చేయాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. పాలకులు మారినా ప్రభుత్వ పెన్షనర్‌ల సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. పెన్షనర్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. జిల్లా ఖజానా శాఖ డిడి రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్‌ల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను ఆత్మీయంగా సన్మానించారు. వారిలో ఆ సంఘం అధ్యక్షులు పెద్దన్నగౌడ్ కూడా ఉండటంతో అతిథులు, కుటుంబ సభ్యులు, సంఘం నేతలు అందరూ పెద్దన్నగౌడ్ దంపతులను ఆత్మీయంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్‌ల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.ప్రభాకర్, జిల్లా కోశాధికారి జి.రామకృష్ణ, గౌరవసలహాదారులు డి.గోవిందరాజులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మహమ్మద్, సంయుక్త కార్యదర్శులు కిష్టప్ప, మధు, వేణుగోపాల్, సత్యనారాయణ, ఆదిలక్ష్మి, సావిత్రిదేవి, నాగరాజేశ్వరి పాల్గొన్నారు.



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు, అతిథులు

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో

కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సోమనాథ్‌నగర్‌లోని బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ నాయకులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి బాల రంగయ్య, అధ్యక్షులు ఓ.బాబయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ్, పద్మనాభచారి, సుభాన్, పి.వెంకటనారాయణ తదితరులు హాజరయ్యారు. ఇటీవల కొచ్చిన్‌లో జరిగిన అఖిల భారత సదస్సులో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన ఎం.రాజశేఖర్‌రెడ్డితో పాటు పెన్సనర్లను ఆత్మీయంగా సన్మానించారు.

కాలుష్యం కోరల్లో చెరువులు



సడ్లపల్లి చెరువులోకి వ్యర్థాలను వేస్తున్న దృశ్యం



వ్యర్థాలను ట్రాక్టర్లలోకి నింపుతున్న దృశ్యం

సడ్లపల్లి చెరువులో వ్యర్థాలు

అధికారంలోకి ఎవరు వచ్చినా కృష్ణా జలాలతో చెరువులన్నీ నింపుతామని, ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తామని పంటలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని నాయకులు నిత్యం చెబుతుంటారు. అయితే కృష్ణా జలాలతో చెరువులను నింపుతారో లేదో తెలియదు గాని మురుగు వ్యర్థాలు, మురుగు నీటితో చెరువులను నింపుతున్నారు. దీంతో హిందూపురం చుట్టుపక్కన ఉన్న అన్ని చెరువులు కాలుష్య కుంపటిగా మారుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

చెరువులు జనానికి నీటి వనరులు. చెరువులు శుభ్రంగా ఉంటేనే ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుంది. అయితే ఇప్పటికే వివిధ కారణాలతో చెరువులన్నీ కాలుష్యకారకాలుగా మారిపోయాయి. మరోవైపున చెరువులను ఆక్రమించి రకరకాల నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని తొలగించడానికి రకరకాల అడ్డంకులు ఎదురవుతుండడంతో అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇది చాలదన్నట్లు హిందూపురం పరిసర ప్రాంతాలలో ఉన్న చెరువులన్నీ మురుగు నీటితో నిండి మురుగు తటాకాలుగా మారిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న చెరువులను శుభ్రం చేయాల్సింది పోయి మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ఇది తెలిసినప్పటికీ జల వనరుల శాఖ అధికారుల్లో కనీస చలనం సైతం కనిపించడం లేదు. చెరువులనే కాకుండా చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను సైతం మురుగు కాలువలుగా మార్చుకుంటున్నప్పటికీ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. తాజాగా ఆటోనగర్ ఎదురుగా ఆటోనగర్ యూనియన్ కార్యాలయ సమీపంలో ఆటోనగర్ నుంచి సేకరించిన వ్యర్థాలన్నీ ఒకచోట పడేశారు. ఈ వ్యర్థాలను పురపాలక సంఘానికి చెందిన డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే డంపింగ్ యార్డ్ కు తరలించకుండా ఓ గుత్తేదారుడు రెండు జెసిబిలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో పక్కనే ఉన్న సడ్లపల్లి చెరువులోకి వ్యర్థాలను వదులుతున్నారు. దీంతో సడ్లపల్లి చెరువు మరింత కాలుష్య కారకంగా మారిపోతోంది. ఇప్పటికీ ఇదే చెరువును కొంతమంది స్వార్థపరులు కబ్జాలు చేసుకుని ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. దీంతోపాటు వ్యర్థాలను తరలించి చెరువులు మూసివేసి కాలుష్యంగా మారుస్తున్నారు. పెద్ద ఎత్తున వర్షాలు కురిసి చెరువులోకి నీరు వస్తే ఆ కాలుష్య నీరంతా భూమిలోకి ఇంకిపోవడంతో పాటు అవేనీళ్లు రోడ్లపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరిచి చెరువులను కాపాడాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యంగా అధికార యంత్రాంగం

చెరువులను, చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి ఎక్కడా కబ్జాలకు గురికాకుండా, మురుగు నీరు చెరువులోకి తరలించకుండా చూడాల్సిన జల వనరుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొట్నూరు, సూగురు, సడ్లపల్లి, శ్రీకంఠాపురం చెరువులతో పాటు పట్టణ సమీపంలో ఉన్న అన్ని చెరువులు కబ్జాలకు గురి కావడంతో పాటు పురపాలక సంఘంలో మురుగు వ్యర్థాలను చెరువులోకే వదులుతున్నారు. ఇది చాలాదన్నట్లు ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలను తరలిస్తున్నారు. పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాల్సిన జల వనరుల శాఖ అధికారులు తామేమి చూడలేదని... తమకేమీ తెలియదని అన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం. చెరువులు, కుంటల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ప్రత్యేక ఆదేశాలను సైతం జారీ చేసింది. ఈ ఆదేశాలను సైతం అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జల వనరుల శాఖ అధికారులతో పాటు రెవిన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని చెరువులు కబ్జాలకు గురికాకుండా, మురుగు వ్యర్థాలు చెరువులోకి తరలించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శాసనాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి - గోరంట్ల

దక్షిణాది ప్రాంతంలో ఉన్న ప్రాచీన శాసనాలు కాలగర్భంలో కలిసిపోక ముందే వాటి పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని చరిత్రకారుడు మైనా స్వామి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని మాధవరాయ ఆలయంలో ఆయన మాట్లాడుతూ భారత పురాతత్వ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టకపోవటంతో వందలాది శాసనాలు కంకర రాళ్లుగా మారిపోయాయని, ఈ పరిస్థితి మున్ముందు పునరావృతం కాకూడదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర పురాతత్వ, సాంస్కృతిక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు లేఖ పంపుతున్నట్టు చెప్పారు. భారత పురాతత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న శాసనాల (ఏపీగ్రఫీ) విభాగం మైసూరులో ఉన్నప్పటికీ శాసనాల పరిరక్షణ, పరిష్కారం, ప్రచారం విషయంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండడం లేదని మైనాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూలల్లో ఉన్న కొన్ని శాసనాలను వెలికి తీసి భద్రపరచాలని మైసూరు శాసన విభాగానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం కన్పించ లేదన్నారు. శాసనాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టక పోయినందున హంపి నుంచి శ్రీకాళహస్తి వరకు గల ప్రాచీన ఆలయాలు, కోటలు చారిత్రక ప్రదేశాల వద్ద ఉన్న శాసనాలు కంకర రాళ్లుగా మారిపోతున్నాయన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన తుళువ వంశావళిని వివరిస్తున్న చలివెందుల శాసనం 2018 జనవరి నాటికి ముక్కలైందన్నారు. అదేవిధంగా గోరంట్ల మాధవరాయ గుడి సమీపంలోని శాసనాలున్న రెండు పెద్ద గుండ్లను కొందరు పగులగొట్టారన్నారు. చలివెందుల, గోరంట్ల శాసనాలు నాశనమైన సంఘటనలు ఒక ఉదాహరణ మాత్రమే అని అలాంటివి వందల కొద్ది శాసనాలు భావితరాలకు అందకుండా పోయాయని మైనాస్వామి వాపోయారు. పెనుకొండ చెరువు పక్కన గల వీరన్న కొండ, నిడి మామిడి వీరభద్ర గుడి ఆవరణ. పాత దేవరపల్లి, గోరంట్ల, మేరెడ్డిపల్లి, కదిరి లక్ష్మీనరసింహాలయం సంస్కృత శాసనాలు, సోమ పాళయం చెన్నకేశవ ఆలయం శాసనాలను వెంటనే నమోదు చేయాలన్నారు. మైసూరు ఏపీగ్రఫీ విభాగం వారు కేవలం ఇతరుల మీద ఆధారపడి వాట్సాప్ ద్వారా చర్యలు చేపట్టకుండా, క్షేత్ర పర్యటనలు విరివిగా చేసి శాసనాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేయించాలని తన లేఖలో కేంద్ర మంత్రిని కోరుతున్నట్టు చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు.



ధ్వంసమైన శాసనాలను చూపుతున్న మైనాస్వామి

గుడిబండకు చేరిన కృష్ణాజలాలు

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ చెరువుకు మొట్టమొదటిసారిగా కృష్ణా జలాలు చేరాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు చెరువును సందర్శించారు. కూటమి హయాంలో మొట్టమొదటిసారి గుడిబండ చెరువుకు నీరు చేరాయన్నారు. ఈసందర్భంగా జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు లక్ష్మీ నరసప్ప, మద్దనకుంటప్ప, చిత్ర శేఖర్, బాలేపల్లి రాజు, న్యాయవాది శివకుమార్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - నల్లమాడ

హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులుగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును ఎంపిక పట్ల మండల తెలుగుదేశం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజూరెడ్డి. మహేశ్వర్ రెడ్డి, అరవింద్ బాబు,ఎం రవికుమార్, ఏఎల్ నరసింహులు, పి ప్రసాద్ బాబు, ఆటో యూనియన్ అధ్యక్షులు కేశవ, పూల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలోని సామసేను బైలు గ్రామ దళితవాడకు చెందిన వెంకటరమణ పొలం దారి సమస్యను బుధవారం పరిష్కరించారు. ఈసందర్భంగా తహశీల్దార్ బాబురావు మాట్లాడుతూ దళితవాడకు చెందిన వెంకటరమణ పొలానికి వెళ్లే రాస్తాకు పట్రా వాండ్లపల్లి చెందిన రైతు రమణ రాళ్లు అడ్డంగా వేశారన్నారు. రస్తాను పరిశీలిస్తే అది ప్రభుత్వ భూమి అని రికార్డులలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చంద్రశేఖర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

విద్యానగర్‌లో పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని విద్యానగర్ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ డిఈ. రమేష్ కుమార్ వార్డు పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వార్డు ప్రజలకు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో త్వరలో విడుదల కానున్న రూ.92 కోట్లతో వార్డుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు, మొదా శివ, వాసు చౌదరి, మారుతి, సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మీటింగ్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం భోజనశాల, సమావేశ మందిరాన్ని ఎంఇఒలు కృష్ణనాయక్, శ్రీనివాసులు, యోగివేమల ఆలయ పూజారి తుంగ పూజారి నంద రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో గది శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారనానరు. దాత పూజారి తుంగ నందా రెడ్డి తన వంతు దాదాపు లక్ష రూపాయలు అందజేయడంతో శిథిలావస్థలో ఉన్న గదిని తొలగించి ఆ స్థానంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సరళ, సురేష్ బాబు, ఉపాధ్యాయులు విశ్వనాథ్ రెడ్డి, షంషేర్, మాధవి, పిఇటి పాపారాయుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రాల్లో సామాజిక వేడుకలు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని ఆయా అంగన్వాడీ సెంటర్లలో బుధవారం సామాజిక వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని గోరంట్ల 3, రాజీవ్ కాలనీ 2 అంగన్వాడీ సెంటర్లలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ సెంటర్లలో అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, మనోహరమ్మ, సహాయకురాలు మేఘన పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలకేంద్రంలోని పిహెచ్‌సిలో డాక్టర్ హరిత ఆధ్వర్యంలో పల్స్ పోలియో పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యాక్సిన్ నిర్వహణ, పోలియో బూత్‌లో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

బత్తలపల్లి :పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ అనిల్ కుమార్,డాక్టర్ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లి లోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

అంగన్వాడీలకు 5జి మొబైల్ ఫోన్లు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని అంగన్వాడీలకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా నూతన 5 జి మొబైల్ ఫోన్లను, ఫ్రీ స్కూల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ రాధిక , టిడిపి నాయకులు బహువుద్దీన్, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు

ఇండియా బీచ్ గేమ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : దాద్రానగర్ హవేలీ, డామన్, డయ్యూ రెండో ఎడిషన్ ఖే లో జనవరి 5 నుండి 10వ తేదీ వరకు నిర్వహించే ఇండియా బీచ్ గేమ్స్ 2025 కొరకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి కిషోర్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 19న విజయవాడలో మణిపాల్ హాస్పిటల్ దగ్గర గల కార్యాలయానికి 9 గంటలకు హాజరుకావాలని చెప్పారు. వివరాలకు 9866134016, 9052 464770ను సంప్రదించాలని సూచించారు.

బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమారన్



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమారన్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకోచ్చిన బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌పై ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమారన్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలోనిటిటిడి కళ్యాణమంటపంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో పాటు ఎల్‌టిపిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం పురపాలక సంఘంతో పాటు మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి పురపాలక సంఘాల అధికారులతో ఆయా పురపాలక సంఘాల వారిగా సమీక్షించారు. హిందూపురం పురపాలక సంఘంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 5 మంది ప్లానింగ్ సెక్రేటరీలకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఎసిపి చంద్రమ్మను రీజనల్ డైరక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భవనాల యజమానులు 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మించిన అనుమతి లేని లేదా నిబంధనలకు విరుద్ధమైన భవనాలను ఒకసారి క్రమబద్ధీకరించుకోవచ్చని అన్నారు. అదే విధంగా అక్రమ లేఆవుట్లను సక్రమం చేసుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ పథకం తీసుకువచ్చారన్నారు. ఈ రెండు పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు పోవాల్సిన భాధ్యత ప్లానింగ్ సెక్రేటరీలతో పాటు ఎల్‌టిపిలపై ఉందన్నారు. ఒక సచివాలయ పరిధిలో 300 నుంచి 400 వరకు గృహాలు ఉంటాయని క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్లానింగ్ సెక్రేటరీలు ప్రతి ఇంటిని పరిశీలించి వారు ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నారా, తీసుకొని ఉంటే నిర్మాణం నిబంధనలు పాటించారా అన్న విషయాలను సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేసిన వాటితో పాటు అనుమతులు లేని భవనాలను గుర్తించి, వారందరు బిపీఎస్ ద్వారా అనుమతులు తీసుకోనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అప్పటికి వారు వినక పోతే ఆ భవనాలను కూల్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చాల కఠినంగా వ్యహరిస్తోందని చెప్పారు. అదే విధంగా అనుమతులేని లే ఆవుట్‌లను గుర్తించి, లే అవుట్ వేసిన వారితో చర్చించి ఎన్‌ఆర్‌ఎస్ పథకం ద్వారా అనుమతులు పొందే విధంగా చూడాలన్నారు. అనుమతులు పొందని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆయా పురపాలక సంఘాల్లో అక్రమ భవనాలతో పాటు లే అవుట్లు సక్రమం కావాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై ప్రతి రోజు సెల్ కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తామని, వారి వారి పరిధిలో ప్రతి రోజు ప్రగతి ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎసిపి సునీల్ రాజ్, చంద్రమ్మ, ధర్మరాజు, టిపిఒలు అబ్దుల్ సత్తార్, అలివేలమ్మ, సాయి ప్రసాద్ తో పాటు టౌన్ అధికారులు, ప్లానింగ్ సెక్రేటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి పిలుపునిచాక్చరు. ఈమేరకు ఆయనను లేపాక్షి మండలం శిరివరం పంచాయతీ తిరుమల దేవరపల్లి వైసిపి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితి గురించి చర్చించారు. అనంతరం వేణు రెడ్డి మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో వ్యవహరించి పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లన్న, భాస్కర్, కృష్ణారెడ్డి, సంజీవన్న, సుధాకర్ ,నాగరాజు, బాలకృష్ణ, కొండారెడ్డి, తిప్పన్న, క్రిష్టప్ప, ఆవులప్ప, అశోక్, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వేణురెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చెరువు భూములు కాపాడాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని పంతులచెరువు గ్రామానికి సంబంధించి చెరువు భూమి ఆక్రమణకు గురవుతోందని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు బిసి సంక్షేమసంఘం తరపున ఆర్డీవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. సర్పంచి భర్త రమణారెడ్డి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చెరువుకు సంబంధించిన సర్వే నెంబర్ 55, 55-1, 55-2లో రికార్డు పూర్వకంగా చెరువు తొట్టె అయితే ఆభూమిని పట్టా పొందడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆ భూమిని చదును చేశారన్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు నారాయణ, చంద్రశేఖర్, ఆంజనేయులు, మల్లికార్జున ,నాగమల్లు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : కందికుంట



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కదిరి పట్టణంలోని పీవీఆర్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వంద కోటా సంతకాలు సేకరించినా ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కూటమి ప్రభుత్వం 18 నెలల సమయంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలకు నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయి సమావేశాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, మండల, పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీల ప్రకటన : టిడిపి టౌన్, మండల కమిటీలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రకటించారు. పట్టణ అధ్యక్షులుగా డైమండ్ ఇర్ఫాన్‌ను యధావిధిగా కొనసాగించారు.కదిరి రూరల్ మండల అధ్యక్షులుగా హరికృష్ణ, గాండ్లపెంట గొడ్డు వెలుగుల ప్రసాద్, ఎన్ పి కుంట శ్రీ రాములనాయుడు, తలుపుల మేడ శంకర, తనకల్లు రెడ్డిశేఖర్‌రెడ్డి, నల్లచెరువు మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ ను నియమించారు.



కదిరి రూరల్ అధ్యక్షులు హరికృష్ణ




గాండ్లపెంట అధ్యక్షులు ప్రసాద్

ఎల్‌ఆర్‌జిలో నాణ్యమైన విద్య

విద్యాసంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఎల్‌ఆర్‌జి విద్యాసంస్థలను స్థాపించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్, ప్రముఖ వ్యాపార వేత్త నిఖిల్ గోవింద్ రామమూర్తి అన్నారు. హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్‌ఆర్‌జి విద్యా సంస్థల్లో బుధవారం ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిఖిల్ గోవింద్ రామ మూర్తి, జిల్లా ఉప విద్యాధికారి జాన్‌రెడ్డప్ప, ఎంఇఒ గంగప్ప పాల్గొన్నారు. తొలుత ముఖ్యఅథితులు ఎన్‌సిసి విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాల హెచ్‌ఎం సుధ ఆనంద్ అధ్యక్షత వహించిన సమావేశంలో ముఖ్య అథితులు మాట్లాడుతు నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాల కీర్తి ప్రతిష్టలు నలు దిశలా చాటాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న సంకల్పంతో ఎల్‌ఆర్‌జి విద్యాసంస్థలను స్థాపించడం జరిగిందన్నారు. అయితే గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు పట్టణ విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఎల్‌ఆర్‌జి సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని విద్యాసంస్థలను స్థాపించి, తక్కువ ఫీజులతో ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పారు. పాఠశాల సెక్రేటరి బాలసుందరం మాట్లాడుతు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవలో సైతం వారిని భాగ్యస్వాములు చేసి సమాజాభివృద్దికి సైతం ఉపయోగపడే విదంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమోంటోలు, మెరీట్ స్కాలర్‌షిప్‌లను, వివిధ క్రీడల్లో రాణించిన వారికి మెమోంటో, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కిరికెర సర్పంచి భాగ్యమ్మ, పాఠశాల సెక్రటరీ వి బాలసుందరం, అకాడమీ డైరెక్టర్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ బ్రహ్మచారి, విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి సంజీవరెడ్డి, విజయ్, హరినాథ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ ఇచ్చి అభినందిస్తున్న నిఖిల్ గోవింద్ రామ మూర్తి, డిఐఇఒ తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా కేంద్ర సాధన సమితి, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన తలపెట్టిన ర్యాలీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి జయప్రదం చేయాలని జిల్లా కేంద్ర సాధన సమితి నాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్ర సాధన సమితి అధ్యక్షులు ఇందాద్ ఆధ్వర్యంలో నాయకులు శ్రీరాములు, బాలాజీ మనోహర్, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులను కలిసి మద్దతు కూడకట్టారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులను కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. జామియా మసీద్ కమిటీ ముతవల్లి అస్లాం ఖాన్, సభ్యులు మెంబర్స్ ఇందాద్, అస్లాం, బాబా, రెహ్మాన్, కురుబ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు గంగాధర్, లక్ష్మీనారాయణ, నాయీబ్రాహ్మణ సంఘం నరసింహమూర్తి, రమేష్, నాగేంద్ర, సుబ్బరాయుడు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ 19వ తేదీ శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు సర్కిల్ నుండి గురునాథ్ సర్కిల్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీల్, బాబావలి, అమానుల్లా, కదిరిష్, నూర్ మొహమ్మద్, అతిక్ నరసింహమూర్తి, రమణ, భరత్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌గా 'జ్ఞాన సాయి' విద్యార్థులు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఎస్‌జిఎఫ్‌ఐ ఫెన్సింగ్, స్టేట్ డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీ జ్ఞానసాయి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఓడిసి మండల కేంద్రం లోని శ్రీ జ్ఞానసాయి హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షరణి, గుంటూరులో డిసెంబర్ 12,13,14 న జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది.అలాగే అనంతపురం నగరం ఆర్డిటి స్టేడియంలో డిసెంబర్ 14న జరిగిన 5వ ఏపీ స్టేట్ డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్‌షిప్ - 2025 లో సబ్ జూనియర్స్ డ్యూయెట్ విభాగంలో 4వ తరగతి చదువుతున్న శ్రీ జ్ఞానసాయి విద్యార్థులు నిషి,నిధి స్టేట్ ఫస్ట్ సాధించి గోల్డ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ క్రిష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన అభినందనసభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒడిసి ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పాల్గొని విద్యార్థులు అభినందించి సన్మానించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

'గ్రామాన్ని వేరుచేయొద్దు'

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని మేరెడ్డిపల్లిని మందలపల్లి పంచాయతీలోనే కొనసాగించాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం గ్రామ కార్యదర్శి జైపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మేరెడ్డిపల్లి గ్రామం చిత్రావతి నదికి తూర్పు వైపు ఉండడం వలన మేరెడ్డిపల్లి గ్రామాన్ని కమ్మవారి పల్లి గ్రామపంచాయతీలో కలుపుతారని గ్రామస్తులకు తెలియడంతో గ్రామస్తులు ముకుమ్మడిగా పార్టీలకు అతీతంగా పాత పంచాయతీలోని తమ గ్రామం ఉండాలని అధికారులను కోరారు. తమ గ్రామం పొలాలు మందలపల్లి రెవెన్యూ విలేజ్ లోనే ఉన్నాయని ఈ నేపథ్యంలో తమ గ్రామం మందలపల్లి పంచాయతీలోని ఉండాలని డిమాండ్ చేశారు.

గాండ్లపెంట : తమ గ్రామాన్ని తుమ్మల బైలు పంచాయతీలో కలుపొద్దని సాదలవాండ్రపల్లికి చెందిన ప్రజలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక ఎంపిడిఒ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాన్ని తుమ్మల బైలు పంచాయతీలో కలిపితే తలెత్తె సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవి నాయక్, కృష్ణనాయక్, గంగులప్పతో పాటు దాదాపు 40 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - గుడిబండ

పైలెట్ ప్రాజెక్టు ద్వారా రైతులు మల్బరీ చెట్లు నాటడం వల్ల అధిక దిగుబడులు రావడానికి సాధ్యమవుతుందని పట్టు పరిశ్రమల శాఖ ఏడీ హనుమంతు నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని జమ్మల బండ సమీపంలో ఉన్న ప్రభుత్వ పట్టు క్షేత్రంలో ఒరిస్సాలో రైతులు సాగు చేస్తున్న టస్సర్ అర్జున, సోము సొల్లు అను చెట్లను పరిశీలించారు. చెట్ల పైన పెంచే నాన్ మల్బరీ పురుగుల ద్వారా చెట్లపైనే పండించుకునేందుకు పైలట్ ప్రాజెక్టు ద్వారా మొక్కలను నాటడం జరిగిందని చెప్పారు. ఈ చెట్ల పైన పురుగులను వదిలి పట్టు పెంచే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ చెట్ల పెంపకం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంచిటిగ వక్కలిగల కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ, పట్టు పరిశ్రమల జెడి, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మాజీ సర్పంచి శ్రీనాథ్ శివకుమార్ పట్టు రైతులు, పరిశ్రమ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పరిగి

వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేలా ప్రభుత్వం సరైన గుర్తింపు కల్పించాలని బీర లింగేశ్వర స్వామి విభిన్న ప్రతిభావంతుల సంఘం సభ్యులు కోరారు. బుధవారం పరిగి మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ భవనంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమంది విభిన్న ప్రతిభావంతులు సరైన అవగాహన లేక ఇంటికే పరిమితం అవుతున్నారని అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి సరైన ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పన్న ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

రోగులకు మెరుగైన వైద్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. ఈ మేరకు ఆమె బుధవారం ధర్మవరంలోని అర్బన్, ప్రైమరీ హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ నెల 21 నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్క్రబ్ టైఫస్ పై ప్రజలకు అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డాక్టర్ చెన్నారెడ్డి, అర్బన్ వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ , అర్బన్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి సేవా సంస్థ చేయూత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని చెన్నకేశవపురంలో ఒక పూరి గుడిసెలో బేల్దారి కూలీగా జీవనం చేసే ఆనంద్ భార్య ఆడ శిశువుకు జన్మనిచ్చి ప్రసవ సమయంలోనే మృతిచెందింది. తల్లి మరణంతో పసికందు ఆలనా పాలన చేత గాక తండ్రి ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలిసిన మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు లాక్టోజన్ పాల పౌడర్‌కు వ్యక్తిగత విరాళాలు సేకరించి పాప సంరక్షణ చూస్తున్న నానమ్మకు గత నాలుగు నెలలుగా అందచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా పాపకు కావలసిన పాల పౌడర్ పాకెట్స్ కొరకు మానవతా సంస్థ సలహాదారు శ్రీ గూడూరు మనోహర్ గుప్త ఆర్థిక సాయం అందజేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ తల్లం నారాయణ మూర్తి, అధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి సల్లా చంద్ర శేఖర్, సభ్యుడు రాజశేఖర్ మెడికల్ సూపర్వైజర్ శ్రీనివాసులు, మెడికల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత పాల్గొన్నారు.

పెన్షనర్లకు సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా కొత్తచెరువు లోని పెన్షనర్ల భవనంలో 75 సంవత్సరాల పైబడిన రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు రామకృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్తచెరువు బుక్కపట్నం పుట్టపర్తి మండలాల్లోనే రిటైర్డ్ ఉద్యోగులు 11 మందికి ఈసందర్భంగా సన్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు వెంకన్న, నాగార్జున శెట్టి, శ్రీరాములు, వెంకటరత్నం, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మడకశిర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆమిదాల గొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో బుధవారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. వృద్ధులకు రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ చారి దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, ఫక్రుద్దీన్, శాంత వీరప్ప, వై ప్రభాకర్, రాజారావు, గణపతి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు విస్తరణకు ఆమోదం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మేడాపురం సర్కిల్ నుండి బుదిరెడ్డిపల్లి మీదుగా సింగిరెడ్డిపల్లి వరకు రోడ్డు విస్తరణకు ప్రజలు తమ ఆమోదం లెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రజలతో మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బాలకృష్ణ పిఏ వీరయ్యలు బుధవారం బాలయోగి కళ్యాణ మంటపంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా అందరికీ అనుకూలంగా ఉండడంతో పాటు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు విస్తరణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 40 అడుగులు ఉందని, అందరూ ఆమోదిస్తే దీనిని 80 అడుగుల మేర విస్తరణ చేస్తామని అన్నారు. దీనికి స్థానిక ప్రజలందరూ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని బాలకృష్ణ దష్టికి తీసుకువెళ్లి చర్చించి నిర్ణయం తీసుకొని త్వరతగితిన పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భారతి, మద్దన జయరాములు, పల్లా ఆదిశేషులు, పామిశెట్టి శేఖర్, చంద్ర మోహన్, ఓ.పి.డి.ఆర్. శ్రీనివాసులు, శ్రీధర్ బాబు, మంచాల మారుతి, డిసి రఘు, పూజారి నాగన్న, పల్లా కుమార్, పల్లా చంద్ర, ఉప్పర చంద్ర, పురిడి మంజు, బుసల్లి మనోహర్, అశ్వర్థ నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సింగిరెడ్డిపల్లి బాబా, ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

'షేక్ మదీనా' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ – షేక్ మదీనా' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని హిందూపురం పట్టణం లోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పట్టణ డీఎస్పీ మహేష్ అధ్యక్షతన భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, రూరల్ సర్కిల్ సిఐ జనార్దన్, కవులు, రచయితలు రాజశేఖర్ రెడ్డి, ఏటిగడ్డ అశ్వర్థనారాయణ, గంగాధర్, మౌలానా సాజిద్, మౌలానా ఇర్ఫాన్, మౌలానా ఉబేదుల్లా, హుసేన్, జామియా మసీదు వైస్ ముతవల్లీ ఫారూఖ్, అబూ హుర్రైరా మసీదు ముతవల్లీ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.